
సాక్షి
ఒడిశా
శనివారం । 4 । ఫిబ్రవరి । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయంలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన హుండీ ఆదాయాన్ని ఆలయ పాలకవర్గం శుక్రవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.4,28,256లు, బంగారం 22.6 గ్రాములు, వెండి 24.1 గ్రాములు ఉన్నాయని అధికారులు వెల్లడించారు.



10 జిల్లాల్లో వర్చువల్ హైకోర్టు

- 8లో.



వ్యవసాయ రంగంలో రాష్ట్రం పురోగతి

- 8లో.

న్యూస్‌రీల్

అగ్నిమాపక దళం పేరు మార్పు



భువనేశ్వర్: రాష్ట్ర అగ్నిమాపక శాఖ పేరు మార్చారు. ఒడిశా ఫైర్ అండ్ ఎమర్జెన్సీ సర్వీసెస్(ఓఎఫ్ఎస్) కొత్త పేరుగా ప్రకటించారు. ఈ మేరకు శాఖాపరమైన ఉత్తర్వులు ఈ ఏడాది జనవరి 27న ఒడిశా గెజిట్‌లో ప్రచురించారు. గతంలో అగ్నిప్రమాదాలు, వరదలు, తుపానులు వంటి ప్రకృతి వైపరీత్యాల్లో ఈ దళం ముందంజ సేవలు అందజేసిన చట్టబద్ధమైన గుర్తింపు లేదు. ఈ కార్యకలాపాలకు చట్టబద్ధత కల్పించేందుకు ఒడిశా ఫైర్ అండ్ ఎమర్జెన్సీ సరీ్వసెస్‌గా మలిచారు. ఈ చర్యతో ప్రకృతి వైపరీత్యాల సమయంలో రెస్క్యూ, రిలీఫ్, రికవరీ కార్యకలాపాల్లో అగ్నిమాపక దళానికి చట్టపరమైన గుర్తింపు లభిస్తుంది.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి



విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న ఏడీఎం ప్రధాన్

రాయగడ: విద్యార్థులు చదువుతో పాటు క్రీడా రంగంలో కూడా రాణించాలని జిల్లా అదనపు మేజిస్ట్రేటు సోమనాథ్ ప్రధాన్ ఆకాంక్షించారు. పట్టణంలోని అటానమస్ కళాశాల వార్షిక క్రీడోత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన.. విద్యార్థులు వారికి ఆసక్తి ఉన్న రంగాల్లో రాణించాలంటే ఎంతో శ్రమ, పట్టుదల అవసరమని తెలిపారు. చిన్నప్పటి నుంచే వారు తమ గమ్యాన్ని నిర్దేశించుకుని, ఆయా రంగాల్లో రాణించే విధంగా కృషి చేయాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పీకే గంతాయత్ మాట్లాడుతూ గత 2రోజులుగా నిర్వహిస్తున్న వార్షిక క్రీడోత్సవాలు ఘనంగా ముగిశాయని తెలిపారు. విద్యార్థులు ఎంతో ఉత్సాహంతో వివిధ అంశాల్లో పాల్గొని, తమ ప్రతిభను చాటుకున్నారని అభినందించారు. అనంతరం క్రీడల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో రాయగడ మున్సిపాలిటీ చైర్మన్ మహేష్ పట్నాయక్ పాల్గొన్నారు.

మర్లబ ఘాటీలో ట్రక్కు బోల్తా



ఘాటీలో బోల్తా పడి ఉన్న ట్రక్కు

పర్లాకిమిడి: రాయఘడ బ్లాక్ మర్లబ ఘాటీలో శుక్రవారం మధ్యాహ్నం బరంపురం నుంచి వస్తున్న సరకు రవాణా ట్రక్కు అదుపుతప్పి, బోల్తా పడింది. ఈ ఘటనలో డ్రైవర్‌కు గాయాలు కావడంతో రాయఘడ స్వాస్థ్య కేంద్రానికి తరలించి, ప్రాథమిక చికిత్స అందించారు. రాయఘడ ఐఐసీ ఘటనా స్థలాన్ని పరిశీలించి, కేసు నమోదు చేశారు.


సైకిల్ ఎమ్మెల్యే గంగాధర్ దాస్ మృతి



సైకిల్‌పై గంగాధర్ దాస్ (ఫైల్)

భువనేశ్వర్: సైకిల్ ఎమ్మెల్యేగా ప్రసిద్ధి చెందిన భద్రక్ జిల్లా చాంద్‌బాలీ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే గంగాధర్ దాస్(91) కన్నుమూశారు. కొద్ది రోజుల క్రితం వృద్ధాప్య అనారోగ్యంతో జిల్లా కేంద్రంలోని ప్రధానాస్పత్రిలో చేరిన ఆయన.. చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. దాస్ చాంద్‌బాలీ రిజర్వ్‌డ్ అసెంబ్లీ స్థానం నుంచి 1971లో కాంగ్రెస్ నుంచి, 1977లో జనతాదళ్ నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసి, గెలుపొందారు. తన హయాంలో నియోజకవర్గ అభివృద్ధికి ఎన్నో పనులు చేశారు. 80పదులు దాటిన వయస్సులోనూ నిత్యం సైకిల్‌పై తిరుగాడే ఆయన.. తన సాదాసీదా జీవన శైలితో చివరిక్షణం వరకు ప్రజాదరణ పొందారు. దాస్ మృతిపట్ల ధామ్‌నగర్ మాజీ ఎమ్మెల్యే రాజేంద్ర దాస్, చాంద్‌బాలీ మాజీ ఎమ్మెల్యే విజయ్ నాయక్, పలువురు ప్రముఖులు సంతాపం తెలిపారు. ఆయన మృతితో భద్రక్ ప్రాంతంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

ప్రజా సంతోషమే.. నా సంతోషం



కొరాపుట్ జిల్లాకు మంజూరు చేసిన పథకాలను వెల్లడిస్తున్న సీఎం

- కొరాపుట్ జిల్లా ఉన్నతికి కట్టుబడి ఉంటా
- జయపురంలో సభలో ముఖ్యమంత్రి నవీన్ పునరుద్ఘాటన
- వీడీ కళాశాల 75వ వార్షికోత్సవానికి హాజరైన సీఎం
- రూ.1,596 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన



సమావేశానికి హాజరైన మహిళలు

జయపురం: కొరాపుట్ జిల్లా ప్రజల అభ్యున్నతికి, సర్వాంగ ఉన్నతికి కట్టుబడి ఉంటానని రాష్ట్ర ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ స్పష్టంచేశారు. తుమె ఖుషీతో.. మూ ఖుషీ(ప్రజల సంతోషమే.. నా సంతోషం) అని పునరుద్ఘాటించారు. స్వయంపాలిత జయపురం విక్రమ్‌దేవ్ కళాశాల 75వ వార్షికోత్సవం(ప్లాటినమ్ జూబ్లీ) సందర్భంగా నిర్వహించిన వేడుకలను ఆయన శుక్రవారం ముఖ్య అతిథిగా హాజరై, ప్రారంభించారు. పట్టణంలోని దసరా పాడియా మైదానంలో ఏర్పాటు చేసిన బహిరంగ సమావేశంలో మాట్లాడారు. జిల్లా విద్యారంగంలో ముందడుగు వేసేందుకు వీలుగా విక్రమ్‌దేవ్ కళాశాలను యూనివర్సిటీగా అప్‌గ్రేడ్ చేస్తున్నట్లు ప్రకటించారు. దీని వల్ల అవిభక్త కొరాపుట్ జిల్లాలో విద్యా ప్రమాణాలు మరింతగా పెరుగుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. మిషన్‌శక్తి ద్వారా స్వయం సహాయక సంఘాల మహిళల సాధికారత కోసం ఆర్థికంగా చేయూత అందిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో రూ.1,596 కోట్లతో113 అభివృద్ధి పథకాలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. అనంతరం వేదిక పైనుంచే సామూహికంగా శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో భాగంగా బొరిగుమ్మ, బొయిపరిగుడ సమితులకు చెందిన 2 ఉత్తమ మిశన్‌శక్తి స్వయం సహాయక గ్రూపు మహిళలకు రూ.లక్ష చొప్పున వడ్డీలేని రుణాలు ముఖ్యమంత్రి చేతుల మీదుగా అందజేశారు. అంతకుముందుక భువనేశ్వర్ నుంచి ప్రత్యేక హెలీకాప్టర్‌లో జయపురం చేరుకున్న ఆయనకు.. మిషన్‌శక్తి మహిళలు, కళాశాల ప్లాటినమ్ జూబ్లీ నిర్వహణ కమిటీ, పూర్వ విద్యార్థులు వేర్వేరుగా సన్మానించారు. మహారాజ విక్రమదేవ్ వర్మ ప్రతిమను కానుకగా సమర్పించారు.



ముఖ్యమంత్రి నవీన్‌తో ఎమ్మెల్యే తారాప్రసాద్, ప్లాటినమ్ జూబ్లీ నిర్వాహక కమిటీ

నెరవేరిన చిరకాల స్వప్నం..

ముందుగా స్వాగతోపన్యసం చేసిన కొరాపుట్ ఎమ్మెల్యే, జిల్లా ప్రణాళికా బోర్డు అధ్యక్షుడు రఘురాం పాడాల్.. బీజేడీ ప్రభుత్వంలో కొరాపుట్ జిల్లా ఉన్నతికి చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. జయపురం ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి మాట్లాడుతూ జిల్లా ప్రజల చిరకాల కోరిక నేరవేర్చుతూ విక్రదేవ్ కళాశాలను విశ్వవిద్యాలయంగా ప్రకటించినందుకు ముఖ్యంత్రికి కృతజ్ఞతలు తెలియజేశారు. యూనివర్సిటీగా ప్రకటించిన స్థానిక కళాశాలలో ఆడిటోరియం ఏర్పాటు చేయాలని ఎంతో కాలంగా కోరుతున్నామని, దీనిని సైతం పరిశీలించాలన్నారు. చారిత్రాత్మక జయపురం జగన్నాథ సాగర్, ప్రసిద్ధ శైవక్షేత్రం గుప్తేశ్వర్‌ను అభివృద్ధి చేయాలని కోరారు. అలాగే జిల్లాలో అనేక సందర్శనా స్థలాలు ఉన్నాయని, వాటి ద్వారా పర్యాటకాభివృద్ధికి చర్యలు చేపట్టాలన్నారు. పురాతన వరి వంగడం లభించిన స్థానిక జిల్లాలో వ్యవసాయ విశ్వవిద్యాలయం నెలకొల్పాలని విన్నవించారు. అవిభక్త కొరాపుట్‌లో నిరుద్యోగులైన యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు.

మురిపించిన మెలక..

1947–48లో అప్పటి జయపురం మహారాజు విక్రమదేవ్ వర్మ స్థానిక కళాశాలను స్థాపించారని, ప్రస్తుతం 4వేల మంది విద్య అభ్యసిస్తున్నారని విక్రమదేవ్ కళాశాల ప్రిన్సిపాల్ గోపాల్ హల్దార్ తెలిపారు. విశ్వ విద్యాలయంగా ఏర్పాటు కావడంతో అవిభక్త కొరాపుట్ జిల్లా విద్యారంగంలో ఉన్నత శిఖరాలను చేరుకోవచ్చని అభిప్రాయం వ్యక్తంచేశారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ అధ్యక్షురాలు ఆదివాసీ మహిళ సస్మిత మెలక ఆంగ్లంలో ప్రసంగిస్తూ సభికులను, ముఖ్యమంత్రిని అబ్బుర పరిచారు. ఆమె తన ప్రసంగంలో అవిభక్త కొరాపుట్‌లో ఆదివాసీ ప్రజల స్థితిగతులను వివరిస్తూ, వారంతా విద్యారంగంలో ప్రగతి సాధించినప్పుడే ఈ ప్రాంతం అభివృద్ధి సాధ్య పడుతుందన్నారు. రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ మంత్రి రోహిత్ పూజారి కొరాపుట్ జిల్లాలో విద్యా ప్రగతికి ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. 5టీ కార్యదర్శి వీకే పాండ్యన్, జిల్లా ఎస్‌డీసీ చైర్మన్ చంద్రశేఖర మాఝి ప్రసంగించారు.

ననాకే నినాదాలు..

జయపురం ఎమ్మెల్యే తారాప్రసాద్ వేదిక పైకి చేరుకొని ననాకే అని ప్రసంగించగానే.. సభికులంతా ననాకే అని బదులిచ్చారు. బాహిణీపతిని జయపురం ప్రజలు ననాకే అని సంబోధిస్తుంటారు. ఈ నేపథ్యంలో ప్రజలంతా ననాకే నినాదాలతో తమ ఉత్సాహాన్ని కనబరిచారు. మరోవైపు జిల్లాలోని 14 సమితులు, 4 మున్సిపాలిటీల నుంచి వేలాది మంది ప్రజలు ముఖ్యమంత్రి సభకు వచ్చేశారు. వారందరికీ ఇబ్బందులు లేకుండా ప్రాంతాల వారీగా వేర్వేరు కౌంటర్లు ఏర్పాటు చేసి, భోజన సౌకర్యం కల్పించారు.

ప్రయాణికుల అవస్థలు..

సభకు తెల్లవారు 8 గంటల నుంచే వివిధ ప్రాంతాల నుంచి పెద్దఎత్తున ప్రజలు తరలి రాగా, ఉదయం 9 గంటలకే విశాలమైన సభాస్థలం కిక్కిరిసింది. వీఐపీలు, ప్రత్యేక ఆహ్వానితులు, మీడియా ప్రతినిధులు వారికి కేటాయించిన స్థలాలకు వెళ్లేందుకు సైతం ఇబ్బందులు పడ్డారు. మరోవైపు సీఎం నవీన్ పర్యటన నేపథ్యంలో జయపురం పట్టణంలో పోలీసులు కఠిన ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. ఓఎస్ ఆర్‌టీసీ యాజమాన్యం 27 రూట్లలో బస్సులను నిలిపి వేయగా, ప్రజలను ప్రాంగణానికి తీసుకు వచ్చేందుకు 49 ప్రభుత్వ, ప్రైవేటు బస్సులను వినియోగించారు. దీంతో సాధారణ ప్రయాణికులకు అవస్థలు తప్పలేదు. అలాగే ట్రాఫిక్ నియంత్రణలో భాగంగా పాఠశాలలకు ముందస్తుగా సెలవు ప్రకటించారు.



ప్రసంగిస్తున్న మంత్రి రోహిత్ పూజారి



బస్టాండ్‌లో పడిగాపులు కాస్తున్న ప్రయాణికులు



బొయిపరిగుడ ఉత్తమ ఎస్‌హెచ్‌జీ సంఘానికి వడ్డీలేని రుణం అందిస్తున్న సీఎం



సభలో కేరింతలు కొడుతున్న వీడీ కళాశాల విద్యార్థులు



సావనీర్ విడుదల చేస్తున్న ముఖ్యమంత్రి, చిత్రంలో కళాశాల ప్రిన్సిపాల్ హల్దార్

చిక్కుల్లో తిర్తోల్ ఎమ్మెల్యే



- బిజయ్‌శంకర్ దాస్‌పై ఎఫ్‌ఐఆర్ నమోదుకు హైకోర్టు ఆదేశాలు



ఎమ్మెల్యే బిజయ్‌శంకర్ దాస్‌తో బాధితురాలు సోమాలికా(ఫైల్)

భువనేశ్వర్: బిజూ జనతాదళ్ అభ్యర్థి, తిర్తోల్ నియోజకవర్గ ఎమ్మెల్యే బిజయ్‌శంకర్ దాస్ చిక్కుల్లో పడ్డారు. ఆయన స్నేహితురాలు సోమాలికా దాస్(29) దాఖలు చేసిన పిటిషన్ స్వీకరించి, విచారణ జరిపిన ఒడిశా హైకోర్టు నిందిత శాసనసభ సభ్యుడికి వ్యతిరేకంగా కేసు నమోదు చేయాలని పోలీసులను ఆదేశించింది. వివరాల్లోకి వెళ్తే... 2022 మే 13న సోమాలికా దాస్ దాఖలు చేసిన ఎఫ్‌ఐఆర్ పట్ల కేసు నమోదు చేయడంలో పోలీసుల నిర్లక్ష్యం ప్రదర్శించారు. ప్రధానంగా జగత్‌సింగ్‌పూర్ పోలీస్ స్టేషన్ ఐఐసీ ఆమె సమస్యలను పరిగణలోకి తీసుకోలేదని పిటిషన్‌లో పేర్కొంది. ఎఫ్‌ఐఆర్ ఆధారంగా సీఆర్‌పీసీ 154(3) సెక్షన్ కింద ఏదైనా చర్య తీసుకోవడంలో జిల్లా ఎస్పీ చొరవ కల్పించుకోవాలి. ఈ మేరకు ఎటువంటి చర్యలు చేపట్ట లేదని ఆమె ఆరోపించింది. ఈ మేరకు సోమాలికా దాఖలు చేసిన పిటిషన్‌ను జనవరి 27న జస్టిస్ ఎస్‌కే పాణిగ్రాహి ధర్మాసనం విచారణ చేపట్టింది. ఈ మేరకు బిజయ్ శంకర్‌కు వ్యతిరేకంగా తాజా ఫిర్యాదుతో పాటు తన ఆర్డర్ కాపీతో ఐఐసీ, జగత్‌సింగ్‌పూర్ పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని పిటిషనర్‌కు ఆదేశించింది. ఈ నేపథ్యంలో తాజా అనుబంధ సమాచారంతో ఫిర్యాదు ఆమోదించి, కేసు నమోదు చేయాలని జగత్‌సింగ్‌పూర్ ఐఐసీకి న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది.

పెళ్లి చేసుకుంటానని నమ్మబలికి..

హైకోర్టు ఆదేశాల మేరకు సోమాలికా జగత్‌సింగ్‌పూర్ ఐఐసీని సంప్రదించి, రాతపూర్వక ఫిర్యాదును సమర్పించింది. దీని ఆధారంగా కేసు నమోదు చేస్తామని ఆమెకు సంబంధిత అధికారి హామీ ఇచ్చినట్లు తెలిపారు. గతంలో దాఖలు చేసిన ఫిర్యాదు వ్యతిరేకంగా ఠాణా పోలీసు అధికార వర్గాలు స్పందించక పోవడంతో హై కోర్టుని ఆశ్రయించడం అనివార్యమైందని స్పష్టంచేశారు. బీజేడీ ఎమ్మెల్యే తన ఎన్నికల ఖర్చుల కోసం డబ్బును సేకరించేందుకు సెక్స్ రాకెట్లను నిర్వహిస్తున్నారని సోమాలికా గతంలో ఆరోపించారు. అలాగే పెళ్లి చేసుకుంటానని దగా చేశారని, జగత్‌సింగ్‌పూర్ రిజిస్ట్రార్ కార్యాలయంలో వివాహానికి అన్నీ సిద్ధం చేసి, సకాలంలో కానరాకుండా అదృశ్యమై తనను మోసం చేశారని విమర్శించింది. దీనిపై తనపై సంబంధిత ఎమ్మెల్యే అత్యాచారం చేశాడని ఆరోపించింది. వీటికి సంబంధించి అన్ని సాక్ష్యాలను అందిస్తానని పేర్కొంది.

కానిస్టేబుల్ అభ్యర్థులకు శిక్షణ



పరీక్షకు హాజరైన అభ్యర్థులు

మల్కన్‌గిరి: జిల్లా కేంద్రంలోని మల్కన్‌గిరి కళాశాలలో ఒడిశా పోలీస్ కానిస్టేబుల్ పరీక్షకు సన్నద్ధమవుతున్న అభ్యర్థులకు శిక్షణ శిబిరాన్ని ఎస్పీ నితీష్ వాధ్వనీ శుక్రవారం ప్రారంభించారు. ఇందులో భాగంగా నిర్వహించిన సామర్థ్య పరీక్షకు సుమారు 100మంది విద్యార్థులు హాజారయ్యారు. కళాశాల ప్రిన్సిపాల్ బిపిన్‌బిహారీ మొహంతి, మల్కన్‌గిరి డీఆర్‌డీఏ పీడీ త్రినాథ్ మాఝి, తహసీల్దార్ రేఛల్ పరిడా హాజరై, పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సామర్థ్య పరీక్షలో ఉత్తీర్ణులైన వారికి ఉచితంగా శిక్షణ అందించడంతో పాటు ఉద్యోగావకాశాన్ని సాధించుకునేలా సూచనలు అందిస్తామని తెలిపారు.



అభ్యర్థులకు సూచనలిస్తున్న ఎస్పీ నితీష్ వాధ్వనీ

క్లుప్తంగా

పేదల నివాసాలకు ప్రత్యమ్నాయ ఏర్పాట్లు


సమావేశంలో ఎమ్మెల్యే సదాశివ ప్రధాన్, చైర్మన్ కున్నునాయక్

కొరాపుట్: నవరంగ్‌పూర్ జిల్లా కేంద్రంలో చెరువు గట్లపై నివాసాలు ఏర్పాటు చేసుకున్న పేదవారికి ప్రత్యామ్నయ ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ మేరకు నవరంగ్‌పూర్ మున్సిపాలిటీ కార్యవర్గ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. ఈ సందర్భంగా చైర్మన్ కున్ను నాయక్ మాట్లాడుతూ పట్టణంలో అనేక చెరువుల గట్లపై నిరుపేదలు నివాసాలు కట్టుకున్నారని గుర్తుచేశారు. వారి వివరాలపై సర్వే చేసి, 125 పేద కుటుంబాలను గుర్తించామని తెలిపారు. వీరందరికీ ఉమెన్స్ కళాశాల ఎదుట బైపాస్ రోడ్డులో ఉచితంగా స్థలాలు కేటాయిస్తామని వెల్లడించారు. అలాగే అందరికీ ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం కింద ఇంటి నిర్మాణానికి ఆర్థిక సాయం చేస్తామని భరోసా ఇచ్చారు. అన్ని పూర్తి హక్కులతో సొంతింటి కల సాకారం చేస్తామని, అనంతరం చెరువు గట్లను ఖాళీ చేయిస్తామని ప్రకటించారు. దీనికి కౌన్సిల్ అంగీకారం తెలిపింది. సమావేశంలో నవరంగ్‌పూర్ ఎమ్మెల్యే సదాశివ ప్రధాన్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

టీడీపీతో పొత్తు ప్రసక్తే లేదు

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము

పాలకొండ రూరల్/పాలకొండ: తెలుగుదేశం పార్టీతో పొత్తుపెట్టుకునే ప్రసక్తేలేదని, జనసేనతో కలిసి ఎన్నికల్లో పోటీచేస్తామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోమువీర్రాజు స్పష్టం చేశారు. పాలకొండలోని ఓ ప్రైవేటు కల్యాణమండపంలో శుక్రవారం నిర్వహించిన పార్టీ జిల్లా విస్తృత స్థాయి సమావేశంలో కార్యకర్తలకు పలు సూచనలు చేశారు. టీడీపీ కుటుంబ పార్టీగా అభివర్ణించారు. అనంతరం విలేకరుతో మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్‌తో ఉత్తరాంధ్ర అభివృద్ధి చెందుతుందన్నారు. జిల్లాలో ఏనుగుల సమస్య పరిష్కారానికి తన వంతుగా కృషి చేస్తానన్నారు. సమావేశంలో ఎమ్మెల్సీ మాధవ్, జిల్లా అధ్యక్షుడు డి. శ్రీనివాసరావు, రాష్ట్ర నాయకులు పి.వేణుగోపాలరావు, కె.నారాయణరావు, పెద్దబాబు, తాడంగి సునీత, హెచ్.ప్రసాద్, కందుల జగన్నాథ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎంలకు పటిష్ట భద్రత

నెల్లిమర్ల: గోదాముల్లోని ఈవీఎంలకు, వీవీ ప్యాట్‌లకు పటిష్ట భద్రత కల్పించాలని కలెక్టర్ ఎ.సూర్యకుమారి సంబంధిత భద్రతాధికారులను ఆదేశించారు. పట్టణంలోని మిమ్స్ సమీపంలోనున్న ఈవీఎం గోదాంలను ఆమె శుక్రవారం తనిఖీచేశారు. భద్రతా ఏర్పాట్లపై సిబ్బందిని ఆరాతీశారు. కలెక్టర్ వెంట డీఆర్‌ఓ ఎం.గణపతిరావు, నెల్లిమర్ల తహసీల్దార్ కె.వి. రమణరాజు, ఎంపీడీఓ జి.గిరిబాల, నగరపంచాయతీ కమిషనర్ పి.బాలాజీప్రసాద్, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ నీలకంఠారావు తదితరులు పాల్గొన్నారు.

రెండు ద్విచక్రవాహనాలను ఢీ కొట్టిన జీపు

వేపాడ: మండలంలోని చినగుడిపాల సమీపంలో శివ కాన్వెంట్ జంక్షన్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో చినగుడిపాలకు చెందిన బాలిబోని సన్నిబాబు (52) మృతి చెందగా మరో ముగ్గురు గాయాలపాలయ్యారు. ఇందుకు సంబంధించి 108 సిబ్బంది, చినగుడిపాల సర్పంచ్ రాముునాయుడు స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన బాలిబోని సన్నిబాబు కొన్నేళ్లుగా నీలకంఠరాజపురం గ్రామానికి చెందిన వ్యక్తి పొలాన్ని కౌలు చేస్తున్నాడు. ఎప్పటిలాగానే శుక్రవారం ఉదయం 7.30 గంటలకు తన టీవీఎస్ ఎక్సెల్ వాహనంపై భార్య దేముడమ్మతో కలిసి పొలం పనికి వెళ్తుండగా దేవరాపల్లి-ఆనందపురం రహదారిలో దేవరాపల్లి నుంచి ఆనందపురం వెళ్తున్న జీపు ఢీ కొట్టి ఎక్సెఎల్ వాహనాన్ని ఈడ్చుకుపోయింది. దీంతో వాహనంపై ప్రయాణిస్తున్న భార్యాభర్తలు రోడ్డుపై పడిపోయారు. ఈ ప్రమాదంలో సన్నిబాబు స్పృహకోల్పోగా, దేముడమ్మ కాలు విరిగిపోయింది. అదే జీపు దేవరాపల్లి వైపు వెళ్తున్న మరో స్కూటీని ఢీ కొట్టింది. దీంతో ఆ స్కూటీపై ప్రయాణిస్తున్న ఇద్దరు గాయాలపాలయ్యారు. వారిద్దరు వేపాడ మండలం భర్తవానిపాలెం గ్రామానికి చెందినవారు. భర్తవానిపాలెం గ్రామానికి చెందిన షేక్ లక్ష్మణరావు ఆనందపురం నుంచి తిమిరాం సంతకు వెళ్తుండగా అదే గ్రామానికి చెందిన దండి సంజీవరావు రైవాడ కెనాల్‌లో డ్యూటీకి వెళ్లేందుకు ఆనందపురంలో నిరీక్షిస్తున్నాడు. దీంతో అటుగా వస్తున్న లక్ష్మణరావు స్కూటీపై సంజీవరావు కూడా ఎక్కగా ఇద్దరూ కలిసి దేవరాపల్లి వైపు వెళ్తుండగా జీపు ఢీకొట్టడంతో కింద పడి గాయాలపాలయ్యారు. లక్ష్మణరావు, సంజీవరావులకు కుడిచేతులు విరిగిపోయాయి.

క్షతగాత్రులకు విశాఖలో చికిత్స

స్థానికుల సమాచారంతో సంఘటనా స్థలానికి వేపాడ, దేవరాపల్లి 108 వాహనాలు చేరుకుని సన్నిబాబు, దేముడమ్మ, సంజీవరావు, లక్ష్మణరావులను కోటపాడు ఆస్పత్రికి తరలించాయి. ఆస్పత్రిలో డ్యూటీ డాక్టర్ పరీక్షించి సన్నిబాబు (52) చనిపోయినట్లు నిర్ధారించారు. గాయాలపాలైన ముగ్గురికి ప్రథమ చికిత్స అనంతరం విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. మృతుడు సన్నిబాబుకు భార్య దేముడమ్మ, కుమారుడు దేముడునాయుడు (ఆటోడ్రైవర్) వికలాంగురాలైన కుమార్తె దేముడమ్మ ఉన్నారు. ఈ సంఘటనపై మృతుడి భార్య ఫిర్యాదు మేరకు దేవరాపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు.

వ్యవసాయ రంగంలో రాష్ట్రం పురోగతి

- రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్ దేవాశీష్ మహంతి
- రాయగడలో ప్రారంభమైన కృషక్ మేళా


జ్యోతి వెలిగిస్తున్న కలెక్టర్ స్వాధాదేవ్ సింగ్


ప్రసంగిస్తున్న దేవాశీష్ మహంతి

రాయగడ: వ్యవసాయ రంగంలో రాష్ట్ర ఎంతో అభివృద్ధి చెందుతోందని రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్ దేవాశీష్ మహంతి తెలిపారు. జిల్లా కేంద్రంలోని గోవిందచంద్ర దేవ్ ఉన్నత పాఠశాల మైదానంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో కృషక్ మేళ శుక్రవారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. రైతులు ఆధునిక వ్యవసాయ విధానాలను అవలంభించడంతో అధిక దిగుబడులు సాధిస్తున్నారని తెలిపారు. దీంతో వారంతా ఆర్థిక, సామాజిక రంగాల్లో ఎంతగానో మెరుగుపడ్డాయన్నారు. రాష్ట్రప్రభుత్వం వ్యవసాయ రంగానికి పెద్దపీట వేస్తోందని, ఈ నేపథ్యంలో రైతుల సంక్షేమానికి అమలు చేస్తున్న పథకాలు సత్ఫలితాలు ఇస్తున్నాయని పేర్కొన్నారు. రైతులకు సబ్సిడీ రూపంలో వ్యవసాయ ఉపకరణాలు వంటిని అందించడంతో పాటు ఆధునిక వ్యవసాయ విధానాలపై వారికి అవగాహన కల్పిస్తుండటంతో వారు ఆయా రంగాల్లో రాణిస్తున్నారని వివరించారు.

రైతుల్లో కొత్త ఒరవడి..

ఆదివాసీ, హరిజన జిల్లాగా గుర్తింపు పొందిన రాయగడ ఆదివాసీ రైతుల్లో కొత్త ఒరవడి ప్రారంభమైందని కలెక్టర్ స్వాధాదేవ్ సింగ్ అన్నారు. కృషక్ మేళాను ప్రారంభించిన ఆమె ఈ సందర్భంగా ప్రసంగించారు. జిల్లాలోని కొండ కోనల్లో నివసిస్తున్న ఎంతోమంది ఆదివాసీల జీవన విధానంలో పెనుమార్పులు సంభవించాయన్నారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ప్రారంభమైన ఈ మేళాలో రైతులకు సబ్సిడీ రూపంలో వివిధ రకాల వ్యవసాయ ఉపకరణాలను విక్రయించేందుకు స్టాల్స్ ఏర్పాటు చేసామని తెలిపారు. వీటిద్వారా సుమారు రూ.10 కోట్ల విక్రయాలు కొనసాగేలా లక్ష్యం పెట్టుకున్నామన్నారు. కార్యక్రమంలో భాగంగా సాగులో అధిక దిగుబడులు సాధిస్తూ, ఇతర రైతులకు ఆదర్శంగా నిలుస్తున్న పలువురు ఉత్తమ రైతులను సన్మానించారు.

అవగాహన కోసమే..

ఇటువంటి కృషక్ మేళాల వల్ల రైతుల్లో వ్యవసాయ రంగంలో ఎంతె అవగాహన లభిస్తోందనే ఉద్దేశంతో ప్రభుత్వం మేళాలను నిర్వహిస్తోందని జిల్లా వ్యవసాయశాఖ అధికారి రామచంద్ర దాస్ అన్నారు. ఈనెల 6వరకు కొనసాగే ఈ మేళాలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన రైతులకు రోజూ వ్యవసాయ విధానాలపై అవగాహన కల్పిస్తామని తెలిపారు. వారికి తగిన సూచనలు, సలహాలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అవలంబించాల్సిన పద్ధతులపై శిక్షణ కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో రాయగడ సమితి అధ్యక్షురాలు టున్ని హుయిక, కొలనార సమితి అధ్యక్షురాలు సంజుక్త కులసిక, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ రవినారాయణ త్రిపాఠి, జిల్లా అదనపు మేజిస్ట్రేట్ ధర్మానంద బెహరా తదితరులు పాల్గొన్నారు. వివిధ ప్రాంతాల నుంచి రైతులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.


సమావేశానికి హాజరైన రైతులు

10 జిల్లాల్లో వర్చువల్ హైకోర్టు

- ప్రారంభించిన సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్


వర్చువల్ హైకోర్టు ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఒడిశా న్యాయమూర్తులు

భువనేశ్వర్: రాష్ట్రంలోని 10 జిల్లాల్లో వర్చువల్ హైకోర్టులను సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్ ఢిల్లీ నుంచి శుక్రవారం వర్చువల్‌గా హాజరై, ప్రారంభించారు. ఒడిశా జుడీషియల్ అకాడమీలో జరిగిన ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎస్.మురళీధర్, ఇతర న్యాయమూర్తులు, 30 జిల్లా కోర్టుల జడ్జిలు, హైకోర్టు మాజీ న్యాయమూర్తులు, 10 జిల్లాల న్యాయవాదులు, హైకోర్టు బార్ అసోసియేషన్ సభ్యులు, ఒడిశా అడ్వకేట్ జనరల్, డిప్యూటీ సొలిసిటర్ జనరల్ ఆఫ్ ఇండియా, న్యాయాధికారులు, ప్రభుత్వ అధికారులు హాజరయ్యారు.

10 ప్రాంతాల్లో సౌలభ్యం..

సంబల్‌పూర్, బాలాసోర్, భద్రక్, బొలంగీర్, పూరీ, కలహండిలోని భవానీపట్న, ఖుర్దాలోని భువనేశ్వర్, కోరాపుట్‌లోని జయపురం, గంజాం జిల్లాలోని బరంపురం, సుందర్‌ఘడ్ రూర్కెలాలో ఈ కోర్టులు ప్రారంభించారు. ఒడిశాలోని మొత్తం 30 జిల్లాల్లో వర్చువల్ కోర్టులను ఏర్పాటు చేయాలని ఒడిశా హైకోర్టు సుప్రీంకోర్టుకు ప్రతిపాదించింది. 2022 డిసెంబర్ 14న సుప్రీంకోర్ట్‌కు హైకోర్టు ప్రతిపాదనను ఆమోదించింది. తొలిదశలో 10 చోట్ల వర్చువల్ హైకోర్టులు ఏర్పాటు చేశారు. ఆయా ప్రాంతాల భౌగోళిక స్థితిగతులు, జిల్లాల నుంచి హైకోర్టులో దాఖలైన కేసుల పరిమాణం ఆధారంగా వర్చువల్ కోర్టుల ఏర్పాటుకు సుప్రీంకోర్టు అనుమతించింది. వర్చువల్ హైకోర్టులలో వీడియో కాన్ఫరెన్సింగ్ సౌకర్యాలు, కేసుల ఈ-ఫైలింగ్ కోసం అనుబంధ సిబ్బందితో బ్యాక్ ఆఫీస్ ఉంటాయి. ఈ-ఫైల్ చేసిన కేసుల పరిశీలన, లోపాల తొలగింపు, కేసుల సంఖ్య, హైకోర్టులో ఉన్న కేసుల జాబితా, దరఖాస్తు సమర్పణ, ఆదేశాలు, తీర్పుల ధ్రువీకరణ కాపీల కోసం దరఖాస్తు దాఖలు, జారీ వంటివి ఈ వర్చువల్ హైకోర్టులలో డిజిటల్ మోడ్ ద్వారా అందుబాటులో ఉంటాయి.

72,760 కేసులు పెండింగ్..

ప్రస్తుతం హైకోర్టులో పెండింగ్‌లో ఉన్న 1.7 లక్షల కేసుల్లో ఈ 10 జిల్లాల నుంచి దాదాపు 72,760 కేసులు దాఖలయ్యాయి. ఖుర్దా నుంచి అత్యధికంగా 27,160 కేసులు నమోదయ్యాయి. గంజాం నుంచి 10,500, పూరీ జిల్లా నుంచి 8,200, భద్రక్ జిల్లా నుంచి 5,300, సంబల్‌పూర్ నుంచి 4వేలు, బొలంగీర్ నుంచి 3,800, కలహండి నుంచి 3,400, రూర్కెలా నుంచి 3,278, కొరాపుట్ జిల్లా నుంచి 3,200 కేసులు ఈ జాబితాలో ఉన్నాయి.

ఎవరికి ప్రయోజనం?

100 కిలోమీటర్ల పరిధిలోని వారి పొరుగు జిల్లాల్లోని న్యాయవాదులు వర్చువల్ హైకోర్టు సౌకర్యాన్ని పొందేందుకు ఈ జిల్లాలు ఎంపిక ఖరారు చేయడం విశేషం. ఈ సందర్భంగా సీజేఐ చంద్రచూడ్ మాట్లాడుతూ, రాష్ట్రంలో న్యాయ బట్వాడా వ్యవస్థలో రోజువారీ ప్రక్రియల్లో సాంకేతికతను అందిపుచ్చుకునేందుకు ఒడిశా హైకోర్టు అనేక కార్యక్రమాలు చేపట్టిందన్నారు. ఈ-ఫైలింగ్‌ను ప్రాచుర్యంలోకి తీసుకురావడం, హైకోర్టు, జిల్లా కోర్టుల విచారణలో వీడియో కాన్ఫరెన్సింగ్ అనుసంధానం వంటి కార్యక్రమాలు ప్రధానమైనవిగా పేర్కొన్నారు. కోవిడ్ మహమ్మారి సమయంలో, హైకోర్టు ప్రతి జిల్లాలో వీడియో కాన్ఫరెన్స్ క్యాబిన్ లను ఏర్పాటు చేసింది. తద్వారా న్యాయవాదులు ఏ జిల్లా నుంచి అయినా ఏ కోర్టులోనైనా హాజరు కావడానికి వీలైంది. జిల్లా కోర్టుల్లో ఈ ప్రక్రియ కొత్త అధ్యాయానికి బీజం నాటిందని కొనియాడారు.

ఒటెయి అడవిలో పులి పాదముద్రలు


అధికారులు గుర్తించిన పులి పంజా

భువనేశ్వర్: అడవిలో పులి పాదముద్రలు కనిపించడంతో అటవీశాఖ అధికారులు గాలింపు చేపట్టారు. కియోంజర్ జిల్లా పాట్నా పరిధిలోని ఒటెయి రక్షిత అటవీ ప్రాంతంలో ఈ ఘటన చోటు చేసుకుంది. ఘటనా స్థలం, పరిసర ప్రాంతాల్లో వరాహం కుళ్లిన కళేబరం తారస పడడంతో గాలింపు చర్యలు చేపట్టారు. ఈ చర్యల్లో పులి పాదముద్రలు తారసపడ్డాయి. దీనిపై అటవీశాఖ అధికారులు విచారణ చేపట్టారు. ఈ పరిసరాల్లో నాలుగుకు పైగా పులుల పాదముద్రలు ఉన్నాయని అటవీశాఖ స్పష్టం చేసింది. అయితే అది వన్యప్రాణికి చెందినదని తెలియాల్సి ఉందని అన్నారు. మరోవైపు పులులను గుర్తించి, పరిసర ప్రాంత ప్రజలను అప్రమత్తం చేసేందుకు అటవీశాఖ ట్రాప్ కెమెరాలను ఏర్పాటు చేసింది. అయితే అడవిలో పులుల పాద ముద్రలు కనిపించడంతో పరిసర ప్రాంతాల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.

అతిక్రమిస్తే కఠిన చర్యలు

- జిల్లా రోడ్డు భద్రతా మండలి సమావేశంలో కలెక్టర్, ఎస్పీ


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ లింగరాజ్ పండా, పక్కన ఎస్పీ స్వాతి

పర్లాకిమిడి: నూతన రవాణా చట్టం ప్రకారం రోడ్డు దుర్ఘటనలు అరికట్టేందుకు చర్యలు చేపడుతున్నామని కలెక్టర్ లింగరాజ్ పండా, జిల్లా ఎస్పీ స్వాతి ఎస్. కుమార్ తెలిపారు. వాహనదారులు నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరించడం, సంబంధిత పత్రాలు లేకుండా వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో జిల్లా రోడ్డు భద్రతా కమిటీ సమావేశంలో నిర్వహించారు. ఈ సందర్భంగా 2021, 22 ఆర్థిక సంవత్సరాలకు సంబంధించి రోడ్డు ప్రమాదాల జాబితాను విడుదల చేశారు. దీని ప్రకారం.. జిల్లాలో 2021లో 3,167 ప్రమాదాలు చోటు చేసుకోగా, 52మంది మృత్యువాత పడ్డారని వెల్లడించారు. నిబంధనలు అతిక్రమించిన వాహనదారుల నుంచి రూ.77,509 జరిమాన వసూలు చేశామన్నారు. అలాగే 2022లో మొత్తం 6,849 ప్రమాదాల్లో 49మంది ప్రాణాలు కోల్పోయారని, రూ.52 లక్షలు అపరాధ రుసుం వసూలు చేశామని పేర్కొన్నారు. తరచూ దుర్ఘటనలు జరిగే ప్రదేశాల్లో సైనేజ్ బోర్డులు ఏర్పాటు చేయాలని ఎస్పీ స్వాతి ఆదేశించారు. నిబంధనలపై ప్రతి మండల స్థాయిలో వాహనదారులకు అవగాహన శిబిరాలు నిర్వహించాలని సూచించారు. అలాగే రోడ్లు, భవనాలు, జాతీయ రహదారి శాఖల ఇంజినీర్లు బ్లాక్‌స్పాట్స్, రోడ్లు మరమ్మతులు పూర్తి చేయాలని వివరించారు. సమావేశంలో ఆర్టీఓ సుశాంత్‌కుమార్ పొరిడా, సబ్ డివిజనల్ పోలీసు అధికారి రామకృష్ణ శత్పతి, ఆర్.ఉదయగిరి సబ్ డివిజన్ అధికారి దిలీప్‌కుమార్ నాయక్, జాతీయ రహదారి ఈఈ రవికాంత కొవ్వురా, ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ శ్రీకాంత్ సామల్, గజపతి జిల్లా ప్రైవేట్ బస్ ఓనర్స్ అసోసియేషన్ కార్యదర్శి రాజు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

చోరీ కేసులో నిందితుల అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ శర్మ, పక్కన ఐఐసీ ప్రధాన్ (వెనుక నిందితులు)

రాయగడ: పట్టణంలో ఇటీవల జరిగిన చోరీ కేసుకు సంబంధించి పోలీసులు నిందితులను అరెస్ట్ చేశారు. ఈ మేరకు జిల్లా ఎస్పీ వివేకానంద శర్మ గురువారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో వివరాలను వెల్లడించారు. స్థానిక బ్యాంకు కాలనీకి చెందిన వ్యాపారి ఐ.సాయి శ్రీనివాసరావు ఇంట్లో జనవరి 17న చోరీ జరిగింది. ఇందులో రూ.10 లక్షల నగదుతో పాటు సుమారు 900 గ్రాముల బంగారు ఆభరణాలు, మరో 1.6 కిలోల వెండి ఆభరణాలను దుండగులు దోచుకున్నారు. ఈ క్రమంలో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ ఘటనలో రవిశంకర్ మహానందియా(31), పరిమి శ్రీకాంత్ అనే ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి, విచారించగా వాస్తవాలు వెలుగు చూశాయి. దొంగిలించిన బంగారు, వెండి వస్తువులను పట్టణంలోని వర్తకులు కొత్తకోట సునీల్‌కుమార్, పిట్ల వీధిలోని కందుల అనీల్‌కుమార్, మామంగళ మందిరం సమీపంలో నివసిస్తున్న కె.ప్రసాద్ కొనుగోలు చేసినట్లు తేలింది. ఈ మేరకు నిందితులతో పాటు ఆభరణాలు ఖరీదు చేసిన వీరిని కూడా పోలీసులు అరెస్ట్ చేసి, కోర్టుకు తరలించారు. వారి నుంచి కొంత బంగారు ఆభరణాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ వివరించారు. ఈ చోరీకి సంబంధించి ప్రత్యేకమైన పోలీస్ బృందాన్ని ఏర్పాటు చేసి, కేసులో పురోగతి సాధించామని వెల్లడించారు. అనంతరం స్వాధీనం చేసుకున్న ఆభరణాలను ఐఐసీ రస్మిరంజన్ ప్రధాన్ సమక్షంలో బాధిత కుటుంబానికి అందజేశారు.

పోలీసులకు సహకరించాలి..

గత కొద్ది నెలలుగా పట్టణంలో దొంగతనాలు పెరిగిపోతున్నాయని, చైన్ స్నాచింగ్ కేసులు కూడా గణనీయంగా పెరుగుతున్నాయని విలేకర్లు ఎస్పీ శర్మ దృష్టికి తీసుకు వెళ్లారు. దీనిపై స్పందించిన ఆయన.. పట్టణంలో పోలీస్ పెట్రోలింగ్ మరింత కట్టుదిట్టంగా నిర్వహిస్తామని తెలిపారు. నేటి సాంకేతిక యుగంలో ప్రజలు కూడా తమ పరిధిని అనుసరించి వారి ఇళ్లలో సీసీ కెమెరాలను అమర్చుకోగలిగితే దొంగతనాల సంఖ్య తగ్గుముఖం పట్టడంతో పాటు నిందితులను పట్టుకునేందుకు ఎంతో ఉపయోగపడుతుందని సూచించారు.


రికవరీ చేసిన ఆభరణాలను బాధిత కుటుంబానికి అందిస్తున్న ఐఐసీ

అడిగిన కంటే.. ఎక్కువే

- రాష్ట్రానికి పుష్కలంగా రైల్వే నిధుల కేటాయింపు
- వెల్లడించిన రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్


రాష్ట్రానికి రైల్వే బడ్జెట్ కేటయింపులను వివరిస్తున్న కేంద్రమంత్రి అశ్విని వైష్ణవ్

భువనేశ్వర్: ఒడిశాలో రైల్వే మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు కొత్త బడ్జెటులో సమగ్రంగా రూ.10,012 కోట్లు మంజూరు చేసినట్లు రైల్వేమంత్రి అశ్విని వైష్ణవ్ శుక్రవారం వెల్లడించారు. రాష్ట్రంలో రైల్వే రంగం అభివృద్ధికి ఈ ఏడాది బడ్జెట్‌లో రూ. 8,400 కోట్లు కేటాయించాలని రాష్ట్రప్రభుత్వం ప్రతిపాదించగా.. రూ.10,012 కోట్లు కేటాయించడం విశేషంగా పేర్కొన్నారు. రైల్వే బడ్జెట్ కేటాయింపుల వివరాలను మంత్రి వీడియో కాన్ఫరెన్స్‌లో వివరించారు. ఈ సందర్భంగా దేశవ్యాప్తంగా రైల్వే జనరల్ మేనేజర్లు, మండల రైల్వే అధికారులు(డీఆర్‌ఎం) ఈ కార్యక్రమంలో వర్చువల్‌గా పాలుపంచుకున్నారు.

280 కిలోమీటర్ల కొత్త రైలు మార్గం

రాష్ట్రంలో 280 కిలోమీటర్ల పొడవునా కొత్త ట్రాక్‌లు వేయనున్నట్లు మంత్రి తెలిపారు. ఈ ఏడాది రాష్ట్రంలో 57 స్టేషన్లను ఆధునీకరణకు బడ్జెట్‌లో నిధులు కేటాయించారు. రాష్ట్రంలో కొనసాగుతున్న ప్రాజెక్టులు, కొత్తలైన్ల మంజూరు, స్టేషన్ ఆధునీకరణ, కొత్త రైళ్లను ప్రవేశపెట్టడం, కొనసాగుతున్న రైలు సేవలు విస్తరించడం, స్టేషన్లు, ఆన్‌బోర్డ్ వంటి ప్రయాణికుల సౌకర్యాలు మెరుగు పరిచేందుకు బడ్జెట్‌లో ప్రాధాన్యత కల్పించామన్నారు. 2022-23 బడ్జెట్‌లో రైల్వే మౌలిక సదుపాయాల కోసం రూ.7,600 కోట్ల మంజూరుకు కేటాయింపులు రూ.6,303 కోట్లకు పరిమితమైనట్లు గుర్తు చేశారు. ఇతరేతర వనరులతో గత ఏడాది సమగ్రంగా రాష్ట్ర రైల్వే రంగానికి రూ.9,734 కోట్లు సమకూరినట్లు పేర్కొన్నారు. ఇందులో రాష్ట్ర వాటా, అదనపు బడ్జెట్ వనరులు ఉన్నట్లు వివరించారు.

రైలు సాంద్రత అంతంత మాత్రమే

సరుకు రవాణాలో రాష్ట్రం భారతీయ రైల్వేకి ఏటా సగటున సుమారు రూ.20,000 కోట్ల ఆదాయం సమకూర్చుతోందని మంత్రి ప్రకటించారు. జాతీయ స్థాయిలో రైలు మార్గాలు సగటు 21 కాగా రాష్ట్రంలో ఈ రేటు 18కి పరిమితమైంది. పొరుగు రాష్ట్రాలు పశ్చిమబెంగాల్‌లో 48, జార్ఖండ్‌లో 33 కొనసాగుతోందన్నారు.

ఈ ఏడాది వందే మెట్రోరైలు..

స్వల్పదూరం రైలు ప్రయాణం మరింత విలాసవంతం కానుందని రైల్వేమంత్రి ప్రకటించారు. వందే మెట్రో రైలు ఈ ఏడాది ఆగస్టు నాటికి డిజైన్ ప్రక్రియ పూర్తవుతుందన్నారు. 2024 ప్రారంభించేందుకు లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. వందే భారత్ రైలు తరహాలో అత్యంత ఆధునిక, వేగవంతమైన రైలు సేవలను స్వల్పదూర నిత్య ప్రయాణికుల కోసం అందుబాటులోకి తేవడం వందే మెట్రో రైలు లక్ష్యంగా పేర్కొన్నారు. కటక్-భువనేశ్వర్ జంట నగరాలు ఇతరేతర స్వల్ప దూర ప్రాంతాల రైలు స్టేషన్ల మధ్య వందే మెట్రోరైలు సేవలు అంచెలంచెలుగా ప్రవేశ పెట్టనున్నట్లు వెల్లడించారు.

పీఆర్ఎస్ వ్యవస్థ మరింత ప్రయోజనకరం

కొనసాగుతున్న ప్రయాణికుల రిజర్వేషన్, విచారణ వ్యవస్థని భారీగా ఆధునీకరించనున్నట్లు మంత్రి తెలిపారు. దాదాపు 10 రెట్లు నాణ్యమైన సేవలను ఈ వ్యవస్థ ప్రదానం చేస్తుందన్నారు. ప్రస్తుతం ప్రతి నిముషం సగటున 25వేల టికెట్లు రిజర్వేషన్ జరుగుతోందని, దీనిని 2 లక్షల 50 వేలకు విస్తరించేందుకు కార్యచరణ రూపొందించామన్నారు. ప్రతి నిముషం సగటున 4లక్షల మంది విచారణకు సంప్రదిస్తుండగా, ఈ పరిమితిని 40లక్షలకు విస్తరించడం సరికొత్త లక్ష్యంగా స్పష్టంచేశారు.

రామతీర్థంలో నేడు రథయాత్ర

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన రామతీర్థంలో శనివారం రాత్రి రథయాత్ర మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వ హించనున్నారు. స్వామివారి పందిరి రాటను పురస్కరించుకుని రథసప్తమి పర్వదినాన సీతారామునిపేట గ్రామస్తులు రథాన్ని ఆలయం వద్దకు తీసుకువచ్చి నూతన హంగులతో సుందరంగా తీర్చిదిద్ది రథయాత్రకు సిద్ధం చేశారు. ప్రతి ఏటా మాఘమాసంలో నిర్వహిస్తున్న రథయాత్ర మహోత్సవానికి దేవస్థానం అధికారులు ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. రాత్రి 10గంటలకు రథంలో సీతాసమేత శ్రీరామచంద్ర ప్రభువును రామతీర్థం తిరువీధుల్లో మంగళవాయిద్యాలు, అశేష భక్తజనం నడుమ ఊరేగించనున్నారు. మూడు గంటల పాటు జరిగే రథయాత్ర మహోత్సవం సజావుగా సాగేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. గతంలో జరిగిన ఘటనలు పునరావృతం కాకుండా పోలీస్ శాఖ చర్యలు చేపట్టింది.

కొప్పెర్ల గురుకులంలో కబడ్డీ, ఖోఖో పోటీలు

పూసపాటిరేగ: మండలంలోని కొప్పెర్ల అంబేడ్కర్ గురుకులంలో ఈ నెల 10 నుంచి 14వ తేదీ వరకు 66వ స్కూల్‌గేమ్స్‌ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) అండర్-19 జిల్లాస్థాయి కబడ్డీ, ఖోఖో పోటీలు నిర్వహిస్తామని గురుకులం ఫిజికల్ డైరెక్టర్ పీవీఎల్ఎన్ కృష్ణ తెలిపారు. 10, 11వ తేదీల్లో కబడ్డీ, 12, 13 తేదీల్లో ఖోఖో పోటీలు జరుగుతాయన్నారు. క్రీడల్లో పాల్గొనదలచిన క్రీడాకారులు గుర్తింపు కార్డుతో హాజరుకావాలని కోరారు.

తైక్వాండో పోటీల్లో బెస్ట్ ప్లేయర్ రేణుక


విద్యార్థిని రేణుకా శ్రీకరిణిని అభినందిస్తున్న పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది

విజయనగరం: రాష్ట్రస్థాయిలో జరిగిన తైక్వాండో పోటీల్లో స్థానిక బాబామెట్ట ప్రభుత్వ బాలికల పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న మొకర రేణుకా శ్రీకరిణి సత్తా చాటింది. ఇటీవల అనకాపల్లిలో గత నెల 29, 30, 31 తేదీల్లో జరిగిన అంతర్ జిల్లాల చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొన్న రేణుక రెండు బంగారు పతకాలు సాధించి టోర్నీ బెస్ట్ ప్లేయర్ అవార్డు సొంతం చేసుకుంది. అంతేకాకుండా ఈనెల 26 నుంచి 28వ తేదీ వరకు హైదరాబాద్‌లో జరగబోయే జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయరాలు తెలిపారు. త్వరలో జరగనున్న జాతీయ పోటీల్లో పతకాలు సాధించి పాఠశాలకు, జిల్లాకు మంచి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని ప్రిన్సిపాల్ ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

పైడితల్లి హుండీల ఆదాయం లెక్కింపు


హుండీల ఆదాయం లెక్కింపును పర్యవేక్షిస్తున్న ఈఓ కిశోర్‌కుమార్, ట్రస్ట్ బోర్డు సభ్యులు

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్యదైవం పైడితల్లి అమ్మవారి హుండీల ఆదాయాన్ని శివాలయం వీధిలో ఉన్న అమ్మవారి కల్యాణమండపం ఆవరణలో శుక్రవారం లెక్కించారు. చదురుగుడిలోని హుండీల ద్వారా రూ.31,90,401 నగదుతో పాటు 41 గ్రాముల 600 మిల్లీగ్రాముల బంగారం, 581 గ్రాముల వెండి లభించిందన్నారు. వీటితో పాటు ఒక అమెరికన్ డాలర్, 20 యూరోస్, ఐదు ఆస్ట్రేలియా డాలర్స్, కువైట్ దినర్, సెంట్‌యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ ఫారెన్ కరెన్సీ లభించాయి. వనంగుడి హుండీల నుంచి రూ.6,83,544లు, 4 గ్రాముల 600 మిల్లీ గ్రాముల బంగారం, 87 గ్రాముల వెండి లభించినట్టు ఆలయ ఈఓ బీహెచ్‌వీఎస్ఎన్ కిశోర్‌కుమార్ తెలిపారు. 71 రోజులకు హుండీల ఆదాయం లెక్కించినట్టు వెల్లడించారు. కార్యక్రమంలో హుండీల పర్యవేక్షణాధికారి డీవీవీ ప్రసాదరావు, ట్రస్టు బోర్డు సభ్యులు డాక్టర్ సత్తి అచ్చిరెడ్డి, నక్కా జ్యోతి, రామ్‌సింగ్ సూరమ్మ, గొర్లె ఉమ, బలివాడ పార్వతి, మూడు జిల్లాల నుంచి శ్రీవారి సేవకులు, ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

జాతీయ జూడో పోటీల్లో సౌమ్యకు బంగారం


కె.సౌమ్యరాణి

శ్రీకాకుళం న్యూకాలనీ: జాతీయ స్థాయి ఖేలో ఇండియా పోటీల్లో సిక్కోలు జూడో యువ సంచలనం కడపల సౌమ్యరాణి సంచలనం సృష్టించింది. కేరళలోని త్రిసూరా వేదికగా జరుగుతున్న 2వ ఖేలో ఇండియా జాతీయ మహిళల సౌత్‌జోన్ లీగ్/ర్యాంకింగ్ జూడో టోర్నమెంట్ పోటీల్లో శ్రీకాకుళం నగరానికి చెందిన సౌమ్యరాణి బంగారు పతకంతో మెరిసింది. ఈ పోటీలు ఈనెల 3వ తేదీన మొదలయ్యాయి. 5వ తేదీ వరకు కొనసాగనున్నాయి. ఇప్పటికే పలు జాతీయ, రాష్ట్ర స్థాయి పోటీల్లో పతకాల పంట పండిస్తున్న సౌమ్యరాణి మరోసారి ప్రతిష్టాత్మక ఖేలో ఇండియా పోటీల్లో పతకం సాధించడం పట్ల సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ఈమె ప్రస్తుతం శ్రీకాకుళం నగరంలోని గుజరాతీపేటలో ఉన్న వరం నగరపాలక హైస్కూల్‌లో 10వ తరగతి చదువుతోంది. డీఎస్‌ఏ జూడో కోచ్ పీఎస్ మణికుమార్ పర్యవేక్షణలో శిక్షణ పొందుతోంది.

న్యాయ కళాశాల వర్చువల్ తనిఖీ

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం జ్యోతీరావు పూలే న్యాయ కళాశాలను బార్ కౌన్సెల్ ఆఫ్ ఇండియా (బీసీఐ) వర్చువల్‌గా శుక్రవారం తనిఖీ చేసింది. కమిటీ అడిగిన అంశాలను నెట్‌లో వర్సిటీ అధికారులు అప్‌లోడ్ చేశారు. గత ఏడాది నవంబర్‌లో రూ. 8.50 లక్షలు చెల్లించారు. బీసీఐ కమిటీ జాప్యం, గుర్తింపు మంజూరు చేయకంపోవటం వల్ల లాసెట్ - 22 ప్రవేశాలు నిలిచిపోయాయి. రెండు విడతలు కౌన్సెలింగ్‌లో సైతం ప్రవేశాలు జరగ లేదు. దీంతో ఉన్నత విద్యా శాఖ, ఉన్నత విద్యా మండలి సమస్యలు బీసీఐ దృష్టికి తీసుకు వెళ్లారు. దీంతో బీసీఐ సభ్యులు వర్చువల్‌లో పూర్తిస్థాయిలో తనిఖీ చేశారు. బీసీఐ గుర్తింపు మంజూరు కోసం ప్రయత్నిస్తున్నామని, వచ్చిన వెంటనే తక్షణ ప్రవేశాలు ఉన్నత విద్యా మండలి అనుమతులతో నిర్వహించనున్నట్లు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సీహెచ్ఏ రాజేంద్ర ప్రసాద్ తెలిపారు.

ఇక నాలుగేళ్ల డిగ్రీ కోర్సు: వీసీ


నిమ్మ వెంకటరావు

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో 2023–24 విద్యా సంవత్సరం నుంచి నాలుగేళ్ల డిగ్రీ కోర్సు (ఇంటిగ్రేటెడ్ ఎడ్యుకేషన్ ప్రొగ్రెం కోర్సు) ప్రారంభించనున్నట్లు బీఆర్ఏయూ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ నిమ్మ వెంకటరావు అన్నారు. వర్సిటీ వీసీ కార్యాలయంలో శుక్రవారం వివరాలు వెల్లడించారు. నూతన విద్యా విధానం నేపథ్యంలో 2030 తర్వాత బీఎడ్, డీఎడ్ కోర్సుల నిర్వహణ ఉండదని తెలిపారు. నాలుగేళ్ల ఐటీఈపీ కోర్సుల నిర్వహణ ఉంటుందని అన్నారు. ఈ నేపథ్యంలో వర్సిటీలో వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఈ కోర్సు ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. ఎన్‌సీటీఈ (అఖిల భారత ఉపాధ్యాయ మండలి) అనుమతులు మంజూరు చేసిందని వివరించారు. డిగ్రీతోపాటు బీఎడ్, డీఎడ్ ఈ కోర్సుతో లభిస్తుందని అన్నారు. సెకెండరీ గ్రేడ్, స్కూల్ అసిస్టెంట్ రెండు పోస్టులకు అర్హత లభిస్తుందని అన్నారు. ప్రస్తుతం వర్సిటీలో బీఎస్సీ ఐటీఈపీలో ఎంపీసీ (మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ), బీఏలో ఐటీఈపీ కోర్సులో చరిత్ర, రాజనీతి శాస్త్రం, అర్థశాస్త్రం సబ్జెక్టులు నిర్వహిస్తామన్నారు. అఖిల భారత ఉపాధ్యాయ మండలి సూచనల మేరకు కోర్సు డిజైన్ చేయనున్నట్లు వివరించారు. రాష్ట్రంలో మొదటి ఐటీఈపీ కోర్సు ప్రారంభిస్తున్న విశ్వవిద్యాలయం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం అని తెలిపారు.

సుస్థిర అభివృద్ధి లక్ష్యసాధనకు సర్వే

నందిగాం: సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు సాధించడం కోసం ఏటా సామాజిక ఆర్థిక సర్వే నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపగణాంకాధికారి దేసూళ సురేంద్ర తెలిపారు. శుక్రవారం నందిగాం మండలం పెద్దతామరాపల్లిలో సమగ్ర వార్షిక నిర్మాణ క్రమ సర్వే, ఆయుష్ ఆరోగ్యంపై సర్వే చేపట్టారు. డివిజనల్ ఉపగణాంకాధికారి వీసీ నందా, ఏఎస్ఓ ప్రశాంతిలతో కలిసి సర్వేలో పాల్గొన్న సురేంద్ర మాట్లాడుతూ ప్రజల జీవన విధానంపై ప్రతి సంవత్సరం సర్వే జరుగుతుందన్నారు. ఈ ఏడాది జిల్లాలో 20 శాంపిల్స్ సేకరించినట్లు చెప్పారు. మంచి నీరు, రోడ్లు, ఆస్పత్రి, రవాణా, వైద్యం, మొబైల్ నెట్‌వర్క్, కంప్యూటర్, టీవీ, శానిటేషన్ తదితర సౌకర్యాలపై సమాచారం సేకరిస్తున్నట్లు తెలిపారు. సర్వేకు ప్రజలు సహకరించాలని కోరారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలు మృతి

పాతపట్నం: మండలంలోని బైరాగిపేటకు చెందిన వృద్ధురాలు సిరిపురం కాంతమ్మ(61) శ్రీకాకుళం రిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్ఐ ఎన్.కామేశ్వరరావు తెలిపారు. ఈ నెల 2న కాంతమ్మ పెద్ద కుమారుడు నూతన ఇంటిలో గృహప్రవేశం నిర్వహించగా.. ఇంట్లో దీపం కాంతమ్మ చీరకు అంటుకుని ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో శరీరం కాలిపోవడంతో కుటుంబ సభ్యులు పాతపట్నం సీహెచ్‌సీకి తరలించారు. మెరుగైన చికిత్స కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు తీసుకెళ్లగా చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలి భర్త ప్రకాశరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

అదనపు షిఫ్ట్.. ఆర్తులకు గిఫ్ట్



- పలాస డయాలసిస్ కేంద్రంలో నాలుగో షిఫ్ట్ ప్రారంభం
- రోగుల అవస్థలను బట్టి అదనపు కార్యకలాపాలు
- ఆనందం వ్యక్తం చేస్తున్న కిడ్నీ వ్యాధి బాధితులు


నాలుగో షిఫ్ట్‌తో కొత్తగా సేవలు పొందుతున్న కిడ్నీ వ్యాధి బాధితులు

కాశీబుగ్గ: కిడ్నీ వ్యాధితో బాధ పడుతూ తరచుగా డయాలసిస్‌కు వెళ్తున్న వారి కోసం ప్రభుత్వం మరో అడుగు ముందుకు వేసింది. బాధితులకు మరిన్ని అదనపు సేవలు అందించాలనే ఉద్దేశంతో డయాలసిస్ కేంద్రంలో సేవలను పెంచుతోంది. తొలుత పలాస డయాలసిస్ కేంద్రంలో మూడు షిఫ్ట్‌లు నుంచి నాలుగు షిఫ్టులకు సేవలను పెంచుతున్నారు. ఇక్కడ విజయవంతమైతే అన్ని కేంద్రాల్లోనూ ఈ పద్ధతి అమలు చేయనున్నారు.

మరింత మందికి సేవలు

జిల్లాలో ఉన్న డయాలసిస్ కేంద్రాల్లో కవిటిలో 15 బెడ్‌లు ఉండగా 100 మంది కిడ్నీ రోగులు సేవలు పొందుతున్నారు. సోంపేటలో 19 బెడ్‌లు 200 మంది కిడ్నీరోగులు, హరిపురంలో 10 బెడ్‌లు 100 మంది కిడ్నీ రోగులు, పలాసలో 15 బెడ్‌లు 100 మంది కిడ్నీ రోగులు, టెక్కలిలో 10 బెడ్‌లు 80 మంది కిడ్నీ రోగులు, శ్రీకాకుళం 17 బెడ్‌లు 180 మంది కిడ్నీ రోగులు, పాలకొండలో 10 బెడ్‌లు 100 మంది వరకు కిడ్నీ వ్యాధి గ్రస్తులు సేవలు పొందుతున్నారు. ఇదే తరహా సేవలు అందితే సుమారు 2700 మందికి అదనపు డయాలసిస్ సేవలు అందుతాయి. వీరికి ప్రస్తుతానికి ప్రభుత్వం తరఫున ఉచిత డయాలసిస్‌తో పాటుగా ఇంజెక్షన్లు, మాత్రలు అందిస్తున్నారు. పెంటాప్, డోలో, ఎవిల్ మాత్రలు, ఎరిత్రోపాయిటిన్, ఐరెన్ ఇంజెక్షన్లు, డియోలన్ లిక్విడ్, టెక్స్‌టోజ్, ఆఫ్‌లీన్ వంటి ఉచిత మందులు అందిస్తున్నారు. ఇవి కాకుండా అత్యవసరమైన మందులను కొనుగోలు చేసి రోగులకు అందిస్తున్నారు.

- జిల్లాలో ఉన్న ఆరు డయాలసిస్ కేంద్రాల్లో ప్రస్తుతం మూడు షిఫ్టుల్లో సేవలు అందుతున్నాయి.
- పలాస డయాలసిస్ కేంద్రంలో ప్రయోగాత్మకంగా నాలుగో షిఫ్ట్ సేవలు పెంచుతున్నారు.
- శుక్రవారం నుంచి నాలుగు షిఫ్ట్ సేవలు ప్రారంభించారు.
- సాధారణంగా.. రోజూ ఉదయం ఏడున్నర గంటలకు ప్రారంభించి రాత్రి ఎనిమిది గంటలకు పూర్తయ్యే ప్రక్రియ అదనపు షిఫ్ట్ కలుపుకుని వేకువజామున 5.30 గంటల నుంచి రాత్రి పదిగంటల వరకు కొనసాగనుంది.
- ఒక్కో షిఫ్ట్‌లో 15 మందికి డయాలసిస్ చేస్తారు.
- ప్రస్తుతం 97 మంది కిడ్నీ రోగులు మూడు షిఫ్ట్‌లలో సేవలు పొందుతుండగా మరో 15 మందికి అదనంగా సేవలు అందుతాయి.
- అలా నెలకు 450 డయాలసిస్‌లు అదనంగా సేవలు అందుతాయి.

నాలుగో షిఫ్ట్‌తో పేదవారికి అవకాశం



నాలుగో షిఫ్ట్ ఏర్పాటు చేయడంతో చాలా మంది పేద రోగులకు ఉపయోగపడుతుంది. డయాలసిస్ కేంద్రంలో కొత్త రోగులకు అవకాశం లేకపోవడంతో ఇతర ప్రాంతాలకు వెళ్తున్నారు. శ్రీకాకుళం, విశాఖపట్నం ప్రాంతాలకు వెళ్లి డయాలసిస్ చేయించుకుంటున్నారు. ఇప్పుడు కొత్త షిఫ్ట్ ఏర్పాటుతో ప్రాంతీయంగా ఉన్న వారికి చక్కని అవకాశంగా భావిస్తున్నాం. నా వయసు 45 ఏళ్లు. రెండు కిడ్నీలకు వ్యాధి సోకింది. నాకు రూ.10 వేల ఫించన్ అందుతుంది. నాలుగేళ్లుగా డయాలసిస్ చేయించుకుంటున్నాను. ఇప్పుడేమో రోజు తప్పించి రోజు డయాలసిస్ జరిపించుకుంటున్నాం. నాలుగో షిఫ్ట్ ఏర్పాటుతో అందరం సంతోషం వ్యక్తం చేస్తున్నాము.

– మురపల్లి ధనలక్ష్మి, పల్లిసారది గ్రామం, వజ్రపుకొత్తూరు మండలం

సమస్యలు తొలగిపోతాయి



పలాస డయాలసిస్ కేంద్రంలో ఇప్పటి వరకు మూడు షిఫ్ట్‌లు ఉండేవి. అక్కడ అవకాశం లేని వారు బోలెడు డబ్బు ఖర్చు చేసి విశాఖ వెళ్లాల్సి వచ్చేది. ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని, రాష్ట్ర మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజులు ఇటీవల పర్యటనలో భాగంగా ఇక్కడ సమస్యను గుర్తించారు. అధికంగా రోగులు డిమాండ్ ఉన్న చోట షిఫ్టులు పెంచాలని ఆదేశించారు. దీంతో తొలుత పలాస డయాలసిస్ కేంద్రంలో ప్ర యోగం చేస్తున్నాం. ఇక్కడ విజయవంతం అయి తే ఆయా ప్రాంతాల పరిస్థితులను బట్టి షిఫ్ట్‌లు పెంచనున్నారు. డయాలసిస్‌తో పాటు మందులు, ఇంజెక్షన్లు, సెలైన్ బాటిళ్లు, నెఫ్రాలజిస్టుతో తనిఖీలు చేయిస్తున్నాం.

– ఇప్పిలి ప్రసాదరావు, సెంట్రల్ మేనేజర్, పలాస, డయాలసిస్ కేంద్రం

జిల్లాలో వివరాలు పరిశీలిస్తే

కిడ్నీ రోగులు :	20 వేలు మంది వివిధ స్థాయిలు
సీహెచ్‌సీలు:	15 (సామాజిక ఆస్పత్రులు)
పీహెచ్‌సీలు :	83 (ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు)


ఉచిత మందులు, ఇంజెక్షన్లు

ప్రాంతీయ ఆస్పత్రులు	: 02
జిల్లా కేంద్ర ఆస్పత్రి	: 01
భోధన ఆసుపత్రి	: 01
డయాలసిస్ కేంద్రాలు	: 06
కిడ్నీ ప్రభావిత మండలాలు	: 07
నియోజకవర్గాలు	: 02
కిడ్నీ ప్రభావిత గ్రామాలు :	187
సేవలు పొందుతున్న వారు :	1000
కొత్తగా వచ్చే అవకాశం :	2700

సమస్యల పరిష్కారంపై దృష్టి: ఎస్పీ

ఎచ్చెర్ల క్యాంపస్:


మాట్లాడుతున్న ఎస్పీ రాధిక

ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీసుల సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెడుతున్నట్లు ఎస్పీ జీఆర్ రాధిక అన్నారు. ఎచ్చెర్ల ఆర్మ్‌డ్ రిజర్వు పోలీసుల కమ్యూనిటీ హాల్‌లో శుక్రవారం దర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ముందుగా సిబ్బంది నుంచి వృత్తి పరమైన, వ్యక్తిగత సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

శాంతిభద్రతల పరిరక్షణలో ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీసులు కీలకమని, వీరి సంక్షేమానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఒత్తిడిని ఎదుర్కోవడానికి యోగా, ధ్యానం, వాకింగ్, రన్నింగ్ వంటి వాటికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. సెలవు రోజుల్లో కుటుంబంతో గడపాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎస్పీ టీపీ విఠలేశ్వరరావు, డీఎస్పీ ప్రసాద్‌రావు, ఆర్ఐ ప్రదీప్ పాల్గొన్నారు.

'ఎక్కువ కేసులు రాజీ చేయాలి'


న్యాయవాదులతో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా

శ్రీకాకుళం పాతబస్టాండ్: జాతీయ లోక్ అదాలత్ ఈ నెల 11న నిర్వహించనున్నామని, ఈ అదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీ అయ్యేలా కృషి చేయాలని న్యాయవాదులను జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షుడు, శ్రీకాకుళం జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా కోరారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి శుక్రవారం జిల్లా బార్ అసోసియేషన్ హాల్‌లో న్యాయవాదులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మా ట్లాడుతూ న్యాయవాదులు లోక్ అదాలత్‌కు సహకరించి కక్షిదారుల్లో అవగాహన కల్పించాలన్నారు. సివిల్ కేసుల్లో రాజీ అవడం వల్ల ఆస్తి తగాదాల్లో కుటుంబంలో బంధాలు గట్టి పడే అవకాశం ఉంటుందని అన్నారు. ఎక్కువ గా సివిల్ కేసులు లోక్ అదాలత్‌లో రాజీ కావడానికి ప్రయత్నించాలని కోరారు. కార్యక్రమంలో కార్యదర్శి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, సీనియర్ సివిల్ జడ్జ్ ఆర్.సన్యాసినాయుడు, జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బెజ్జిపురపు ఫల్గుణరావు, స్టేట్ బార్ కౌన్సిల్ మెంబర్ గేదెల వాసుదేవరావు, బార్ అసోసియేషన్ కార్యదర్శి అన్నెపు భువనేశ్వర రావు, గవర్నమెంట్ న్యాయవాది వినయ్ భూషణ్, సీనియర్ న్యాయవాదులు పొన్నాడ వెంకట రమణారావు పీవీ రమణ దయాళ్ తదితరులు పాల్గొన్నారు.

● అల్విదా.. రూనీ


రూనీకి పోలీసుల గౌరవ నివాళి

ఎచ్చెర్ల క్యాంపస్: ఇంటెలిజెన్స్ సెక్యూరిటీ విభాగంలో శిక్షణ.. పేలుడు పదార్థాల వెలికితీతలో అద్భుత నైపుణ్యం, వీఐపీల భద్రతలో అపార సేవ.. కలగలిపి రూనీ. పోలీసుల డాగ్ స్క్వాడ్‌లో కీలకమైన జాగిలం రూనీ (10) శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందింది. ఎచ్చెర్ల ఆర్మ్‌డ్ రిజర్వ్ మైదానంలో పోలీస్ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. లాబ్రడార్ జాతికి చెందిన ఈ శునకం హైదరాబాద్‌లోని ఇంటెలిజెన్స్ సెక్యూరిటీ విభాగంలో ప్రత్యేక శిక్షణ పొందింది. వయో భారంతో గత ఏడాది ఏప్రిల్ నుంచి అధికారులు విశ్రాంతి ఇచ్చారు. విశాఖపట్నం, తిరుపతి, కాకినాడ వంటి ప్రాంతాల్లో నిర్వహించిన పోలీస్ మీట్‌ల్లో ప్రతిభ కనపర్చి, అవార్డులు సాధించింది. జాగిలం మృతికి ఎస్పీ రాధిక, ఏఎస్పీ విఠలేశ్వరరావు నివాళులు అర్పించారు.

రోడ్డు ప్రమాదంలో కానిస్టేబుల్ మృతి

గోపాలపట్నం: విశాఖ జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో కానిస్టేబుల్ కంచరాన విఠల్‌రావు(35) మృతి చెందారు. ఎయిర్‌పోర్టు పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం.. పొందూరు మండలం గోకర్లపల్లికి చెందిన విఠల్‌రావు కానిస్టేబుల్. ప్రస్తుతం మాధవధార కళింగనగర్‌లోని అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నారు. భార్య లావణ్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఇటీవల అతని భార్య పురుడు కోసం పుట్టింటికి వెళ్లారు. గాజువాక ట్రాఫిక్ విభాగంలో ఆయనకు పోస్టింగ్ కాగా.. అనారోగ్య కారణాలతో కంట్రోల్ రూమ్ నుంచి విధులు నిర్వర్తిస్తున్నారు. గురువారం రాత్రి పోలీస్ కంట్రోల్ రూమ్‌లో విధులు పూర్తి చేసి ఇంటికి వచ్చారు. శుక్రవారం నగరంలో పలు పనులు నిమిత్తం బయటకు వచ్చి తిరిగి ఇంటికి వెళ్లేందుకు డీమార్ట్ వద్ద హైవే దాటుతుండగా.. ఎన్ఏడీ నుంచి మద్దిలపాలెం వైపు అతివేగంగా వెళ్తున్న లారీ అతన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అతని శరీరం గుర్తు పట్టలేని విధంగా ఛిద్రమైంది. విఠల్‌రావు మృతితో అతని కుటుంబంతో విషాదంలో మునిగిపోయింది. మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు. మృతుడి అన్న సన్యాసిరావు ఫిర్యాదు మేరకు లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వృత్తి నైపుణ్య శిక్షణకు హెచ్ఎం విశ్వనాథం

ఇచ్ఛాపురం రూరల్: ఆంధ్రప్రదేశ్ విద్యా సంస్కరణల్లో భాగంగా నాయకత్వ లక్షణాలు, ఉపాధ్యాయుల వృత్తి నైపుణ్య శిక్షణకు ఇచ్ఛాపురం మండలం ధర్మపు రం ఉన్నత పాఠశాలకు చెందిన శున్నాముద్ది విశ్వనాథం ఎంపికయ్యారు. ఈ మేరకు జిల్లా విద్యాశాఖాధికారి జి.పగడాలమ్మ నుంచి శుక్రవారం ఉత్తర్వు అందుకున్నారు. స్టేట్ కౌన్సిల్ అండ్ ఎడ్యుకేషన్ రీసెర్చ్ ట్రైనింగ్ (ఎస్ఈఆర్‌టీ–అమరావతి) ఆధ్వర్యంలో ఈ నెల 6 నుంచి 10 వరకు ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్–అహ్మదాబాద్ (ఐఐఎంఎ) రీసెర్చ్ సెంటర్‌లో శిక్షణ ఇవ్వనున్నట్లు విశ్వనాథం తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు, ఉపాధ్యాయుల్లో వృత్తి నైపుణ్యత, విద్యార్థులకు అవసరమైన సామర్థ్యాలు, విద్యా సంస్కరణలు, కోర్సు డిజైన్‌పై అవగాహన కల్పిస్తామన్నారు.

5న సెక్యూరిటీ గార్డుల ఎంపిక

టెక్కలి: రక్ష, కైరోస్ సెక్యూరిటీ సంస్థ ఆధ్వర్యంలో సెక్యూరిటీ గార్డుల ఎంపిక కోసం ఈ నెల 5న టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ టి.గోవిందమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. 18 నుంచి 40 ఏళ్ల వయసు, టెన్త్(పాస్/ఫెయిల్) చదివి నిర్దిష్ట ఎత్తు కలిగిన అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి గల వారు ఉదయం 10 గంటలకు హాజరుకావచ్చని తెలిపారు.

అయిన వాడే అందరికీ..

- కళాతపస్వి మహాభినిష్క్రమణంతో సిక్కోలులో శోకం
- జ్ఞాపకాలు గుర్తు చేసుకుంటున్న జిల్లా వాసులు



చుక్కల్లారా.. చూపుల్లారా ఎక్కడమ్మా జాబిలి..? అన్న వెండితెర ప్రశ్నకు సమాధానం విశ్వనాథుడు. నరుడి బతుకు నటన.. ఈశ్వరుడి తలపు ఘటన.. ఆ రెండి నట్టనడుమ అర్థవంతమైన కథలను అల్లి తెలుగు సినిమాకు ముద్దలు కలిపి తినిపించిన పెద్దాయన కాశీనాథుని విశ్వనాథ్. క్షార జలధులే.. క్షీరములైన వేళ ఆ మథనంలో మెరిసిన స్వాతిముత్యం ఈ అచ్చ తెలుగు దిగ్దర్శకుడు. కళకు, కళాకారుడికి అంతం లేదని చెప్పి 92 ఏళ్ల వయసులో శివుడిలో ఐక్యమైపోయారు. ఈ ఎడబాటు కేవలం భౌతికమే.. చెప్పులు కుట్టుకునే సాంబయ్య, పక్కవాడి కష్టంలో పాలు పంచుకునే శివయ్య, మత్తులోనూ నాట్యం గురించి మర్చిపోని బాలకృష్ణ, ఔరా అమ్మకుచెల్ల అన్న పెద్ద పదానికి పల్లె రాగం కట్టిన మాధవుడు, ఊపిరితో వేణువూదిన హరి, గర్వం ప్రతిభకు ప్రతిబంధకమని చెప్పిన అనంతరాముడు, సంగీతం అజరామరం అని రుజువు చేసిన శంకరశాస్త్రి.. ఇలా ఆయన సృష్టించిన పాత్రలు తెలుగువారితో శాశ్వతంగా ఉండిపోయే వరం పొందాయి. అలా కాశీనాథుని విశ్వనాథ్ అనే పేరు చిరంజీవిగా నిలిచిపోయింది. ఈ మహా దర్శకుడితో సిక్కోలు వాసులకూ పరిచయం ఉంది. కళా తపస్వి మహాభినిష్క్రమణం వేళ ఆ జ్ఞాపకాలు పంచుకున్నారు.

– శ్రీకాకుళం కల్చరల్

ఆయనతోనే నా కళా జీవితం ప్రారంభం



కె.విశ్వనాథ్ సినిమా ఇండస్ట్రీలో ఒక గొప్ప డైరెక్టర్. ఆయన తెలుగు వారు కావడం మనకు గర్వకారణం. అయితే ఆయన వరకు అది ఖర్మ. ఆయనకు పద్మశ్రీ ఇవ్వడం కాదు. భారతరత్నకు అర్హులు. విశ్వనాథ్‌గారితోనే నా కళాజీవితం ప్రారంభమైంది. 1980, ఆగస్టు 21న హైదరాబాదులో నా అరంగేట్ర సభకు ముఖ్య అతిథిగా వచ్చి నన్ను అభినందించారు. అప్పుడే శంకరాభరణం సినిమా హిట్ అయిన సమయంలో చెన్నైలో ఉన్న ఆయన ఇంటికి వెళ్లి ఆహ్వానించాం. హైదరాబాద్‌లో ఆయన మా ఇంటి పక్కనే జూబ్లీహిల్స్‌లో ఉండేవారు. నా అరంగేట్రానికి వచ్చిన ఆయన సప్తపది సినిమాకు నన్ను ఎంపిక చేసేందుకు ప్రయత్నం చేశారు. కానీ ఫొటోలో చూసి చాలా చిన్నగా ఉండడం వల్ల ఆ అవకాశం నాకు దక్కలేదు. ఆ తర్వాత స్వరాభిషేకం సినిమాలో శ్రీకాంత్, లయపైన ఒక పాట కోసం కొరియోగ్రఫీ కోసం అడిగారు. అయితే ఆ సమయంలో నాకు అమెరికా ప్రయాణం ఉండడం వల్ల ఆయనతో పనిచేసే అవకాశం కలుగలేదు.

– స్వాతీ సోమనాథ్, డైరెక్టర్, సంప్రదాయ నాట్య గురుకులం

నా నాటకం చూసి నన్ను అభినందిచారు



విశ్వనాథ్‌గారితో పరిచయం పెరిగిన తర్వాత మేము ప్రదర్శించిన పురుష సూక్తం నాటకం చూసి అభినందించారు. నేను హ్యాపీడేస్ సినిమాలో చేసిన తర్వాత ఆయనతో పరిచయం పెంచుకోవడానికి ఫోన్ నంబర్ తీసుకుని మాట్లాడాను. అప్పటికి ఆయన చెన్నైలో ఉండేవారు. ఆయన హైదరాబాదు వచ్చిన తర్వాత ఆయన ఇంటిలో ఒక సభ్యుడి మాదిరిగా మారిపోయాను. వారి ఇంటిలో ప్రతి ఫంక్షన్‌కు నన్ను పిలిచే వారు. శుభప్రదం సినిమాలో ఒక అవకాశం ఇవ్వాలని కోరగా.. నువ్వు హీరోవి కదా అంత పెద్ద పాత్ర లేదని అన్నా కూడా వదలకుండా కనీసం చిన్నపాత్ర ఇవ్వాలని కోరాను. ఆ సినిమాలు చిన్న పాత్రలో నటించాను. అయితే ఆయన 'శివాష్టపది' సినిమా నిర్మించాలనుకున్నారు. అందులో నన్ను తీసుకుంటారని ఎవరో చెప్పగా విన్నాను. కానీ ఆ సినిమా ప్రారంభం కాలేదు. ఒక సారి మా అమ్మ జన్మదిన వేడుకలకు బహుమతిగా ఆమెను విశ్వనాథ్, సిరివెన్నెల సీతారామశాస్త్రి ఇంటికి తీసుకువెళ్లాను. అది నాకు నిజంగా మిగిలిపోయిన జీవితకాలపు జ్ఞాపకం.

– వంశీ, హ్యాపీడేస్ హీరో

ఆయన పరిచయం ఒక జ్ఞాపకం



సంగీతం, నాట్యం వంటి కళల వైభవాన్ని పెంచిన మహోన్నత వ్యక్తి దర్శకుడు కె.విశ్వనాథ్. స్వరాభిషేకంలో కులకర్ణి పాత్ర నాకు దక్కాల్సి ఉండగా తృటిలో తప్పిపోయింది. టీవీకే శాస్త్రి సహకారంతో విశ్వనాథ్‌గారితో పరిచయం జరిగింది. ఆయన మాట్లాడే తీరు ఎంతో బాగుంటుంది. – గురుగుబెల్లి లోకనాథం, రచయిత, విమర్శకులు, వివేకానంద జాతీయ అవార్డు గ్రహీత

నన్ను అభినందించారు



ఆయనతో నా అనుభవం అంటే ఒక సారి చెన్నై మ్యూజిక్ అకాడమీ ఆడిటోరియంలో 'వంద వసంతాల సినీ ఇంద్రధనస్సు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వచ్చారు. నా ప్రదర్శనను తిలకించి నన్ను ప్రత్యేకంగా అభినందించి సత్కరించారు. ఇందులో ఉన్నత శిఖరాలకు వెళ్లాలని ఆశీర్వదించారు.

– శ్రీనివాస్, జాతీయ మిమిక్రీ కళాకారుడు మిమిక్రీ

పెళ్లికి హాజరు..



కళాతపస్వి కె.విశ్వనాథ్ 2007లో ఒక పెళ్లికి హాజరుకావడానికి శ్రీకాకుళం వచ్చారు. ప్రముఖ సంగీత దర్శకుడు విద్యాసాగర్ కుమార్తె వివాహం సందర్భంగా పెళ్లికి హాజరు కావడానికి వచ్చి అతని స్నేహితుడైన జానకి రామారావు ఇంటి వద్దకు వచ్చారు. అలాగే 15 ఏళ్ల కిందట చెన్నైలో జరిగిన ఒక కార్యక్రమంలో ఎస్.జానకితో సప్తపది చిత్రంలోని 'గోవుల్ల తెల్లన గోపయ్య నల్లన' అనే గీతాన్ని ఆలపించగా చక్కగా పాడావని విశ్వనాథ్ తనను మెచ్చుకున్నారని సినీ గాయకుడు భారతి రమేష్ జ్ఞాపకం చేసుకున్నారు.